క్లుప్తంగా

వర్షాలు తగ్గినా.. తగ్గని నీటి ముంపు



మాడుగుల మండలం జంపెనలో నీటి ముంపులో ఖరీఫ్ వరి చేలు

మాడుగుల: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో జంపెన, కింతలి, వీజే పురం, ఎం. కోడూరు గ్రామాల్లో ఖరీఫ్ వరి మొనలు నీటి ముంపునకు గురయ్యాయి. వరి మొనలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి నిండా ముంచిందని అన్నదాతలు వాపోతున్నారు.

మహిళా బాక్సర్లకు సత్కారం



మహిళా బాక్సర్లను సత్కరిస్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు, క్లబ్ సభ్యులు

నర్సీపట్నం: క్రీడా దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాక్సింగ్ క్రీడాకారులకు ఎన్టీఆర్ స్టేడియంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు విచ్చేశారు. శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన యర్రా తేజస్విని, బొంతు మౌనికను అభినందించారు. అనంతరం క్రీడా దినోత్సవం సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎంవీ రంగారావు, జాయింట్ సెక్రటరీ పిట్ల శ్రీనివాసరావు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో పోలీసుల నిఘా



డ్రోన్ కెమెరాతో పరిసరాలను పరిశీలిస్తున్న రావికమతం ఎస్ఐ రఘువర్మ

రావికమతం: వినాయక చవితి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్ కెమెరా ద్వారా నిఘా పెడుతున్నట్లు రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. కొత్తకోట సీఐ ఆధ్వర్యంలో రావికమతం, గుమ్మాలపాడు, గర్నికం, చినపాచిలి, మేడివాడ గ్రామాలతో పాటు కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో కూడా డ్రోన్ ద్వారా నిఘా పెట్టి గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా నిఘా పెడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



జోగుంపేటలోని ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: దోమల నివారణకు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గొలుగొండ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. జోగుంపేటలో దోమల నివారణపై వైద్యాధికారి, సీహెచ్‌వో బీజేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల నియంత్రణ భాగంలో ఏఎల్‌వో కార్యక్రమాలు నిర్వహించారు. జోగుంపేటలో ప్రతి ఇంటికి వెళ్లి నిల్వ నీరు ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ సీహెచ్‌ఎంఎస్ రంజని, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం:ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 2.40 లక్షల చెక్కులు అందజేశామన్నారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో 65 మందికి పైగా లబ్ధిదారులకు సుమారు రూ. 48.40 లక్షల సహాయం అందేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రధాన రహదారుల్లో పెరిగిన తుప్పలు, డొంకలు

ఇబ్బందులు పడుతున్న పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు



వీరవల్లి- గాదిరాయి రహదారిలో ఏపుగా పెరిగిన తుప్పలు, డొంకలు



కె.జె.పురం-దబ్బకుంట రహదారిలో పెరిగిన తుప్పలు, డొంకలు

జాడ లేని.. జంగిల్ క్లియరెన్స్

మాడుగుల రూరల్: ప్రధాన రహదారులు తుప్పలు, డొంకలతో దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులకు ఇరువైపులా ఏపుగా తుప్పలు, డొంకలు పెరిగిపోవడం వల్ల పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో గల పలు రహదారుల్లో గతంలో ఏడాదికొక పర్యాయం జంగిల్ క్లియరెన్స్ చేపట్టేవారు. గత ఏడాది నుంచి అటువంటి కార్యక్రమాలు చేపట్టలేదు. దీంతో విష జంతువులు రహదారులపై సంచరిస్తున్నాయి. కొన్నిసార్లు ప్రజలు వాటి బారిన పడుతున్నారు కూడా. నియోజకవర్గానికి చేరువగా ఉన్న కె.జె.పురం నుంచి దబ్బకుంటు వరకు గల మూడు కిలోమీటర్ల రహదారి మొత్తం తుప్పలు, డొంకలతో నిండిపోయింది. ఈ గ్రామానికి చెందిన పంట పొలాలు, కళ్లం పాకలకు వచ్చే రైతులు ఈ రహదారి గుండా నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. రహదారిపై పెరిగిపోయిన తుప్పలు, డొంకల వల్ల వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ రహదారిపై పేరుకుపోయిన తుప్పలు, డొంకలను స్థానికులు స్వచ్ఛందంగా తొలగించారు. అలాగే వడ్డాది జంక్షన్ నుంచి వీరవల్లి, జి. అగ్రహారం, గాదిరాయి వరకు 8 కిలోమీటర్ల రహదారిలో కూడా తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. ఈ రహదారి గుండా సుమారు 15 గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. అనకాపల్లి– జాలంపల్లి ఆర్టీసీ సర్వీసు ఈ రహదారి గుండానే నడుస్తోంది. తుప్పలు తొలగించాలని ప్రతి మూడు మాసాలకొక పర్యాయం జరిగే మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు కోరినా దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆర్ అండ్ బి నుంచి నిధులు లేవని అధికారులు తేల్చి చెబుతున్నారు. ఈ రహదారితో పాటు మాడుగులకు కలిపే మూడు మండలాల దారిలోనూ తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. ఈ రహదారి గుండా చీడికాడ, దేవరాపల్లి, కె. కోటపాడు మండలాలకు చెందిన రహదారిలో కూడా తుప్పలు పెరిగాయి. వీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. వీటితో పాటు కాశీపురం నుంచి శంకరం, జంపెన నుంచి కింతలి, జె.డి.పేట నుంచి జాలంపల్లి పోయే రహదారుల్లో సైతం తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. ఆర్ అండ్ బి పరిధిలో గల ఈ రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బంది..

రోడ్లు భవనాల శాఖ పరిధిలో గల రహదారులకు ఇరువైపుల పెరిగిన తుప్పలు, డొంకలను ఏడాదికొక పర్యాయం తొలగించాలి. మే నెల తర్వాత జంగిల్ పెరిగిపోతుంది. దీని వల్ల పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. విష జంతువులు కూడా రోడ్ల మీద సంచరిస్తున్నాయి. యుద్ధ ప్రాతిపదికన జంగిల్ క్లియరెన్స్ జరగాలి.

– సుంకర శ్రీనివాసరావు, సీడీసీ చైర్మన్, ఖండివరం, మాడుగుల నియోజకవర్గం.



జంగిల్ క్లియరెన్స్ నిర్వహించాలి..

గిరిజన గ్రామాలకు పోయే రహదారులకు ఇరువైపుల తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. దీంతో ఆ దారిలో ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. ఆర్ అండ్ బి శాఖ వారు జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవు. ఇప్పటికైనా అధికారులు దీనిపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.

– శోలం రమేష్, సర్పంచ్, శంకరం, గ్రామం, మాడుగుల మండలం

స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న అమర్‌నాథ్

చోడవరం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి గణేష్ ఆధ్వర్యంలో పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన 63 అడుగుల వినాయకుడిని అమర్‌నాథ్ దర్శించుకున్నారు. సద్భావన కమిటీ ప్రతినిధులు అమర్‌నాథ్‌కు సాదర స్వాగతం పలికారు. కమిటీ ప్రతినిధులను అమర్‌నాథ్ అభినందించారు. అనంతరం పీఎస్‌పేటలో శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో జరిగిన నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుట్రేవు శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అమర్‌నాథ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడిని దర్శించుకుంటున్న గుడివాడ అమర్‌నాథ్

బూత్ కమిటీలకు సమర్థులనే ఎంపిక చేయాలి

నర్సీపట్నం: బూత్ కమిటీల్లో సమర్థవంతంగా పని చేసేవారికి స్థానం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి పెట్ల ఉమాశంకర్ గణేష్ నాయకులకు సూచించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాకవరపాలెం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీలను వీలైనంత త్వరగా నియమించాలన్నారు. గ్రామస్థాయిలో బూత్ కమిటీలు చాలా కీలకమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. హామీలు అమలు చేయకుండా మోసగించడం చంద్రబాబుకు అలవాటు అన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే నూటికి నూరు శాతం హామీలు అమలు చేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు చిటికెల రమణ, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పెట్ల భద్రాచలం, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సుర్ల శేఖర్, రుత్తల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాకవరపాలెం: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సి.మోహన్‌రావు విద్యార్థులకు సూచించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్, పోలీస్‌శాఖ సంయుక్తంగా ర్యాగింగ్, మాదకద్రవ్యాల నియంత్రణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్, మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. అనంతరం క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి నివాళులర్పించారు. బాక్సింగ్, కరాటేలో రాణిస్తున్న విద్యార్థులు జ్యోతి, దివాకర్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నింజాస్ అకాడమీ చైర్మన్ నారాయణరావు, కళాశాల ఏవో దానియల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆధునిక విధానంతో అధిక దిగుబడి



కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

నాతవరం: మార్పులకు అనుగుణంగా వరినాట్లు వేసే విధానంపై కూలీలకు అవగాహన కల్పిస్తున్నామని వ్యవసాయాధికారి సుగుణ అన్నారు. ఆమె శుక్రవారం తాండవ ఆయకట్టు పరిధిలో వరి నాట్లు వేస్తున్న రైతుల పొలాల్లోకి వెళ్లి కూలీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ ఏడాది మండలంలో 6,250 హెక్టార్లలో వరినాట్లు లక్ష్యం కాగా ప్రస్తుతానికి 4,156 హెక్టార్లలో వరి నాట్లు వేశారన్నారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడరాదన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో నిలిచిపోయిన టిప్పర్

రావికమతం: రావికమతం నుంచి తోటకూరపాలెం వెళ్లే దారి మధ్యలో దాసరయ్యపాలెం వద్ద ట్రాఫిక్ అంతరాయం కారణంగా శుక్రవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాసయ్యపాలెం వద్ద నల్లరాయితో వెళ్తున్న టిప్పర్ లారీ రోడ్డు మధ్యలో కూరుకుపోయింది. దీంతో రావికమతం నుంచి తోటకూరపాలెం వెళ్లే వాహన చోదకులు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, అవసరం నిమిత్తం మండలానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న రావికమతం ఎస్ఐ రఘువర్మ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోతిలో కూరుకుపోయిన టిప్పర్ లారీని ప్రొక్లెయిన్ సాయంతో పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. ఎస్ఐ రఘువర్మ చొరవతో రోడ్లపై గోతుల్లో క్రషర్ బుగ్గి వేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. టిప్పర్ లారీకి ఫైన్ విధించామని ఎస్ఐ తెలిపారు.



దాసరయ్యపాలెంలో నిలిచిపోయిన టిప్పర్

వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి

మాడుగుల: వినాయక మండపాల వద్ద జాగ్రతలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి. ప్రసాద్ తెలిపారు. ఆయన మాడుగులలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు వినాయక మండపాలకు అధికారికంగా కనెక్షన్లు తీసుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్న ఎలక్ట్రీషియన్లతో మాత్రమే పనులు చేయించాలన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న వైర్లు మాత్రమే వాడాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కనీస దూరంలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ నిమజ్జనోత్సవాల సమయంలో విద్యుత్ వైర్లకు తగలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో 1912ని సంప్రదించాలన్నారు. విద్యుత్ పరికరాలు తడవకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. జాగ్రతలు తీసుకుని వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ అధికారులు, తహసీల్దార్ భుజంగరావు

కె.కోటపాడు: అనధికారిక లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించినట్లు వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారులు డి.శ్రీనివాస్, సూర్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ భుజంగరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు ఎల్‌ఆర్ఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న ఆసక్తి గల వారు 90 రోజుల్లో వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అనుమతులకు దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. ఈ విధమైన అనుమతులు ఉంటే కొనుగోలు చేసిన ఆస్తికి మరింత చట్టబద్ధత ఉంటుందన్నారు. ఎల్‌ఆర్ఎస్ స్కీమ్‌కు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జేపీవో సునీత, సర్వేయర్ గిరిధర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ నేడు

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్లలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక దశలో గుర్తింపుతోనే క్యాన్సర్ నివారణ

రోలుగుంట: క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తిస్తే నియంత్రించే అవకాశం ఉంటుందని హెల్త్ అండ్ వెల్‌నెస్ విభాగం జిల్లా జాయింట్ డైరెక్టర్ నర్సింగరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యాధికారి శ్రావణితో మండలంలో క్యాన్సర్ టెస్టులు, స్కానింగు గురించి ఆరా తీశారు. కొమరవోలు హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రానికి వస్తున్న రోగులు, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. రోగులతో ఎలా మసులుకోవాలో సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్.కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ షాజహాన్ పాల్గొన్నారు.



రోలుగుంట పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ నర్సింగరావు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



మాట్లాడుతున్న విశ్రాంత తెలుగు అధ్యాపకుడు యలమంద



కస్తూర్బా పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం:ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి 162వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ భాషల్లోకెల్లా తెలుగు భాష చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు అధ్యాపకులు జె.ఎలమంద, విద్యార్థులు పాల్గొన్నారు.

గిడుగు, ధ్యాన్‌చంద్‌కు నివాళులు..

మాకవరపాలెం: తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కేజీబీవీ, ఇతర పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో త్రివేణి, ఉపాధ్యాయులు రాము, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



చౌడువాడలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అప్పలకొండ తదితరులు

చౌడువాడ పాఠశాలలో..

కె.కోటపాడు: చౌడువాడ శ్రీసాయి విద్యావిహార్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీవి అప్పలకొండ, ఉపాధ్యాయులు అప్పలరత్నం, సంతోష్, గణేశమ్మ, నాగమణి, జీవిత, కె.నాగమణి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.



తూటిపాలలో సంప్రదాయ దుస్తుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాశీపురంలో..

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుట్టా నారాయణ, సిద్దనాతి రాము, బుర్రల పూర్ణిమ, కోన ప్రకాష్, కళ్యాణి, కొట్టాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొంతలంలో తెలుగుభాష, క్రీడా దినోత్సం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల డిగ్రీ కళాశాలలో..

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో తెలుగు భాష ప్రవేశ పెడితే గ్రామీణ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కళాశాల ఉపన్యాసకులు పులపర్తి పైడిరాజు, శ్రీనివాసరావు, అంబేడ్కర్‌రాజు, సులేమాన్, శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొంతలం గ్రామంలో..

రోలుగుంట: కొంతలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు, పీఈటీ టీచర్లు సంయుక్తంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి తెలుగు టీచర్ సంతోషి, క్రీడా దినోత్సవ పితామహుడు చిత్రపటానికి నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెలుగు భాష గొప్పదనం వివరిస్తూ నృత్యం చేస్తున్న కాశీపురం హైస్కూల్ విద్యార్థినులు



మాట్లాడుతున్న మాడుగుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయలక్ష్మి

వినాయక మండపాల వద్ద అన్నసమారాధనలు



కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో అన్నసమారాధనకు భారీగా తరలివచ్చిన భక్తులు

మాడుగుల రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. హోటల్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలవ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం మేళతాళాల నడుమ వినాయక నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట: నర్సీపట్నం డివిజన్ రోలుగుంట సెక్షన్ పరిధిలో ఆర్‌డీడీఎస్ పనుల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏపీఎస్ఎం అప్పారావు తెలిపారు. రోలుగుంట. కొమరవోలు, రొంతలం, నాయుడుపాలెం, చెట్టుపల్లి గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.